RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 250 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | గురువారం, 14 మార్చి 2024 | పేజీలు : 4 | వెల : 2/-

# మహిళలపై కాంగ్రెస్ వరాల జల్లు

## మహిళలకు ఏటా రూ.లక్ష ఆర్థిక సాయం

## ఉద్యోగాల్లో వారికి 50 శాతం రిజర్వేషన్





## 5 గ్యారంటీల ప్రకటన




ఇంకొద్ది రోజుల్లో సార్వత్రిక ఎన్నికలను ఎదుర్కొనాల్సి ఉంది. ఒకట్రెండు రోజుల్లో లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశాలు ఉన్నాయి. మే చివరి వారం నాటికి కేంద్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మంగా తీసుకుంటోన్నాయి అన్ని పార్టీలు. వరుసగా మూడోసారి అధికారంలోకి రావడానికి భారతీయ జనతా పార్టీ సారథ్యంలో ఎన్డీఏ.. ఈ సారి గద్దెనెక్కడానికి ప్రతిపక్షాల ఉమ్మడి కూటమి ఇండియా సర్వశక్తులు ఒడ్డుతున్నాయి. దీనికి అనుగుణంగా వ్యూహ, ప్రతివ్యూహాలను రూపొందించుకుంటోన్నాయి. ఈ క్రమంలో- కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వరాలను ప్రకటిస్తూ వస్తోంది. భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా ప్రస్తుతం మహారాష్ట్రలో పర్యటిస్తోన్న ఆ పార్టీ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీ.. తాజాగా బహిరంగ సభను ఉద్దేశించి మాట్లాడారు. మహిళలపై వరాల సునామీని కురిపించారు. కేంద్రంలో తాము అధికారంలోకి వస్తే- మహిళల కోసం అయిదు గ్యారంటీలను అమలు చేస్తామని ప్రకటించారు రాహుల్ గాంధీ. వాటి వివరాలను ఆయన వెల్లడించారు. మహాలక్ష్మి, జనాభాలో సగం- సంపూర్ణ హక్కు, శక్తి సమ్మాన్, అధికార మైత్రీ, సావిత్రిబాయి పులే హాస్టల్.. పథకాలను అమలు చేస్తామని అన్నారు.

1. మహాలక్ష్మి పథకం: దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లో పేద కుటుంబాలకు చెందిన మహిళలకు ప్రతి సంవత్సరం కూడా లక్ష రూపాయలు చొప్పున.. అయిదు సంవత్సరాలకు అయిదు లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందజేత. 2. జనాభాలో సగం- సంపూర్ణ హక్కు: కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో పని చేసే అన్ని శాఖలు, విభాగాధిపతులు, కార్యాలయాల్లో నిర్వహించబోయే కొత్త రిక్రూట్‌మెంట్లల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు. కేంద్ర ప్రభుత్వం పరిధిలోకి వచ్చే అన్ని కార్యాలయాలకూ ఇది వర్తింపు. 3. శక్తి సమ్మాన్: దేశవ్యాప్తంగా ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడి కార్యకర్తలు, మధ్యాహ్న భోజనాన్ని వండుతున్న మహిళలందరికీ ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అందజేస్తోన్న వేతనాలు రెట్టింపు. ఇప్పుడు కేంద్రం వాటాగా అందుతున్న జీతం మొత్తాన్ని రెట్టింపు చేస్తుంది కాంగ్రెస్. నా భర్త తన స్నేహితులతో ఒక రాత్రి పడుకోవాలన్నాడు - స్టార్ హీరోయిన్ 4. అధికార మైత్రీ: దేశవ్యాప్తంగా ప్రతి పంచాయతీలో అధికార మైత్రీ పేరుతో మహిళల నియామకం. గ్రామ స్థాయిలో మహిళలకు దక్కాల్సిన హక్కులు, అధికారాల గురించి తెలియజేయడం, అవి దక్కించుకునేలా మహిళలకు సహకరించడం. 5. సావిత్రిబాయి పులే హాస్టల్: ఉద్యోగ రీత్యా ఇతర ప్రాంతాల్లో ఉండే మహిళల సురక్షితమైన నివాస వసతిని కల్పించడంలో భాగంగా సావిత్రి బాయి పులే పేరు మీద హాస్టల్ సౌకర్యం కల్పిస్తుంది. ప్రతి జిల్లాలో కూడా కనీసం ఒక హాస్టల్ ఏర్పాటు.

## మార్చిలోనే మండుతున్న ఎండలు..

## రికార్డవుతున్న అధిక ఉష్ణోగ్రతలు

హైదరాబాద్: మార్చినెల సగం గడవక ముందే తెలంగాణలో ఎండలు మండిపోతున్నాయి. గత ఏడాదితో పోల్చితే అధిక ఉష్ణోగ్రతలు రికార్డవుతున్నాయి. ప్రస్తుతం రోజువారి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే నాలుగైదు డిగ్రీలు ఎక్కువగా నమోదవుతున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటికే ఎండలు మండిపోతున్నాయి. రెండుమూడు రోజులుగా జిల్లాలోని చాలా ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలపైనే నమోదవుతున్నాయి.



ఆదిలాబాద్ జిల్లా తలమడుగులో మంగళవారం 40.5 డిగ్రీలు, ఆదిలాబాద్ అర్బన్ లో 40.3 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇప్పటివరకు.. రాష్ట్రంలో ఇవే అత్యధిక ఉష్ణోగ్రతలు కావడం గమనార్హం. మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం కొండాపూర్ లో 40.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సిద్దిపేట జిల్లాలో అత్యధికంగా 40.3 డిగ్రీల సంగారెడ్డి జిల్లాలో 39.6 డిగ్రీలు, మెదక్ జిల్లాలో 38.7 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

## దానం కూడా కాంగ్రెస్ బాటేనా?



హైదరాబాద్ : దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలంటారు. పదవి ఉండగానే ఉపయోగించుకోవాలి. అధికారంలో లేకపోతే పనులు కావు. అధికారం మన చేతిలో ఉంటేనే ఏ పని అయినా చేసుకోవడానికి వీలవుతుంది. అందుకే మన రాజకీయ నేతలు ఏ పార్టీ అధికారంలో ఉంటే దాని వెనుక పరుగులు పెట్టడం సహజమే. పార్టీ ఏదైనా తమ పలుకుబడి ఉండాలంటే అధికారం తప్పనిసరి. దీనికి గాను వారు పార్టీలు మారుతుండటం మామూలే. ప్రస్తుతం బీఆర్ఎస్ పరిస్థితి అధ్వానంగా మారింది. అధికారం కోల్పోయి దీన స్థితిలోకి దిగజారింది. ఈనేపథ్యంలో హైదరాబాద్ లో ఏ చిన్న పని కావాలన్నా అధికారం ఉన్న పార్టీ అండ కోసం తాపత్రయపడుతున్నారు. ఇప్పటికే చాలా మంది నేతలు బీఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్ లో చేరారు. తాజాగా ప్రముఖ ఎమ్మెల్యే దానం నాగేందర్ కూడా బీఆర్ఎస్ ను వీడనున్నారని తెలుస్తోంది. హైదరాబాద్ లో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన దానం కాంగ్రెస్ ను పొగిడారు. రేవంత్ రెడ్డిపై ప్రశంసల వర్షం కురిపించారు. కాంగ్రెస్ వచ్చాక రోజు పండగలాగే ఉందంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. దీంతో దానం నాగేందర్ కూడా బీఆర్ఎస్ కు టాటాచెప్పనున్నారని సమాచారం. ఇదివరకే దానం కాంగ్రెస్, టీడీపీ, బీఆర్ఎస్ పార్టీల్లో పనిచేశారు. ప్రస్తుతం బీఆర్ఎస్ లో కొనసాగుతున్నారు. కొద్ది కాలంగా కాంగ్రెస్ లోకి ఎంట్రీ ఇస్తారనే వాదనలకు ఆయన మాటలు ఆజ్యం పోస్తున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ లో పనులు చక్కబెట్టుకోవాలంటే అధికార పార్టీ అయితేనే కుదురుతుంది. అందుకే దానం పార్టీ మారి కాంగ్రెస్ లో చేరాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఆయన కాంగ్రెస్ పార్టీపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. త్వరలోనే పార్టీ మారడం ఖాయంగా కనిపిస్తోంది. బీఆర్ఎస్ పార్టీ మొత్తం ఖాళీ అయ్యే పరిస్థితి ఏర్పడుతోంది. ఒకరి వెంట మరొకరు వరుసగా క్యూ కడుతూ కాంగ్రెస్ కండువాలు కప్పుకోవడానికి రెడీ అవుతున్నారు. ఇంత జరుగుతున్నా బీఆర్ఎస్ పార్టీలో మార్పులు మాత్రం కనిపించడం లేదు. అదే అహంకార ధోరణి నేతల్లో ప్రధానంగా కనిపిస్తోంది. గౌరవప్రదమైన ప్రతిపక్ష హోదాలో ప్రజాసమస్యల పరిష్కారంలో కీలకంగా వ్యవహరించాల్సిన బీఆర్ఎస్ నేతలు నిర్లక్ష్యంతోనే ఉంటున్నారనే వాదనలు వస్తున్నాయి. తాము చేసిన తప్పులపై సర్దిచెప్పుకుంటున్నారు కానీ ఒప్పుకోవడం లేదు. ఇలా బీఆర్ఎస్ పార్టీ మొత్తం దిగజారిపోతోందనే వాదనలు రావడం గమనార్హం.

## మత్స్య అవతారంలో...

## యాదగిరి లక్ష్మీ నారసింహుడు

యాదాద్రి భువనగిరి : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మో త్సవాలలో భాగంగా మూడవ రోజు బుధవారం మత్స్య అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

వేద మంత్రోచ్ఛరణల మంగళ వాయిద్యాల నడుమ స్వామి



వారికి పూజలు ఘనంగా నిర్వహించారు.

రాత్రి 7గంటలకు శేష వాహన సేవ నిర్వహించరు. కాగా, ఆలయ మహా ఉద్ఘాటన తర్వాత రెండోసారి బ్రహ్మోత్సవాలు జరుగుతుండగా, ఈ నెల 21 వేడుకలు కొనసాగనున్నాయి.




హైదరాబాద్ : తెలంగాణను నిన్న మొన్నటి వరకు శాసించిన బీఆర్ ఎస్ పార్టీ.. ఇప్పుడు ఇబ్బందులు ఎదుర్కొంటోంది. లోక్‌సభ ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ బీఆర్ఎస్‌కు అభ్యర్థులు కరువయ్యారు. రోజురోజుకూ పార్టీని వీడుతున్న వారు మాత్రం పెరిగారు. సిట్టింగ్ ఎంపీల్లో ఓడిపోతామనే భయం, కిందిస్థాయిలో కాంగ్రెస్ జోష్ కనబడుతుండటంతో ఆశావహుల్లో నైరాశ్యం నెలకొన్నది. కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగి తెలంగాణ భవన్‌లో సమీక్షల మీద సమీక్షలు నిర్వహిస్తున్నా నాయకులు, కార్యకర్తల్లో ధైర్యం నింపలేక పోతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం తర్వాత గులాబీ దళంలో ఓటమి భయం పుట్టిందా? అంటే ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా అవుననే చెప్పాలి. లోక్‌సభ ఎన్నికల్లో ఎదురైన ఊహించని ఓటమి నుంచి బీఆర్ఎస్ నేతలు ఇంకా తేరుకోలేదు. అందుకేనేమో కొందరు నేతలు త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో కూడా పోటీ చేయడానికి ముందుకు రావట్లేదు. మరికొందరు చివరి క్షణంలో తాను పోటీ చేయనని వెల్లడిస్తున్నారు. దానికి తోడుగా పార్టీ వీడుతున్న నేతల సంఖ్య కూడా రోజురోజుకు అధికం అవుతోంది. ఇటీవలి వరకూ

# టికెట్ తీసుకునేవారేరీ?

## అగమ్యగోచరంలో 'కారుసారు'

నల్లగొండ లోక్‌సభ స్థానం నుంచి బరిలోకి దిగేందుకు ఉవ్విళ్లూరిన శాసన మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కుమారుడు అమిత్ రెడ్డి ఇప్పుడు పోటీకి నో అంటున్నారు. ఇదే విషయాన్ని ఆయన కేసీఆర్‌కు స్పష్టం చేసినట్టు తెలిసింది. చేవెళ్ల నుంచి సిట్టింగ్ ఎంపీగా ఉన్న గడ్డం రంజిత్‌రెడ్డికి మరోసారి టిక్కెట్ ఇస్తున్నామంటూ మొదట్లోనే గులాబీ పార్టీ ప్రకటించింది. అయితే మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి సతీమణి, వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సునీతా మహేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరటంతో చేవెళ్లలో రాజకీయ సమీకరణాలు మారాయి. దీంతో తాను చేవెళ్ల నుంచి పోటీ చేయలేనంటూ రంజిత్, కేసీఆర్‌కు తెలిపినట్టు సమాచారం. దుండిగల్ లో భవనాల కూల్చివేత నేపథ్యంలో మల్కాజ్‌గిరి నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేయాలనుకున్న మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి కుమారుడు డాక్టర్ భద్రారెడ్డి ఇప్పుడు మనసు మార్చుకున్నారు. ఖమ్మం నుంచి సిట్టింగ్ ఎంపీగా ఉన్న నామా నాగేశ్వరరావు ఇప్పుడు ఖర్చు భరించటం కష్టమని వాపోతున్నారు. ఇదే పరిస్థితి సికింద్రాబాద్‌లోనూ కనిపిస్తోంది. అక్కడి నుంచి బీఆర్ఎస్ టిక్కెట్ కోసం ఎదురు చూసిన మాజీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ కుమారుడు సాయికిరణ్%ా% ఇప్పుడు వెనుకంజ వేస్తున్నారు. తనకు అత్యంత దగ్గరగా ఉండే ముఖ్యులను ఎంపీ స్థానాల నుంచి పోటీ చేయాలని కేసీఆర్ అడుగుతున్నారు. నల్లగొండ నుంచి కంచర్ల కృష్ణారెడ్డి, భువనగిరి నుంచి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, మల్కాజిగిరి నుంచి ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, వరంగల్ నుంచి ఎర్రోళ్ల శ్రీనివాస్ లేదా గ్యాదరి బాలమల్లు, చేవెళ్ల నుంచి కాసాని జ్ఞానేశ్వర్ లేదా కాసాని వీరేశ్‌లను పోటీకి కేసీఆర్ ఒప్పించినట్టు తెలుస్తోంది.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## ఏపీలో బీజేపీకి భారీ బలం ఇదే..!

ఏపీలో బీజేపీకి బలంలేదు.. అనే వారు చాలా మంది కనిపిస్తున్నారు. అంతేకాదు.. 2019 ఎన్నికల్లో కేవలం 1 శాతం ఓటు కూడా ఆ పార్టీకి పడ లేదని, నోటాకు వచ్చిన ఓట్లు కూడా రాలేదని అనేవారు ఉన్నారు. ఇది నిజమే. అయినప్పటికీ.. తాజాగా పొత్తుల్లో ప్రధాన భూమిక పోషించిన పార్టీ బీజేపీ. పట్టుబట్టి 6 పార్లమెంటు స్థానాలను దక్కించుకున్న పార్టీ. అంతేకాదు.. అసెంబ్లీ సీట్లలోనూ పట్టుబట్టి10 సీట్లు దక్కించుకున్న పార్టీ కూడా. అయితే.. ఇంతగా బలం లేదని చెబుతున్న పార్టీ అంత పట్టుబట్టడం వెనుక ఏముంది? ఇదీ అసలు ప్రశ్న. ఇక్కడ బీజేపీకి ఉన్న బలం నాయకులు, కార్యకర్తలు అనుకుంటే పొరపాటే. వారు ఉన్నారు. లేరని కాదు. సీమలో చూస్తే.. విష్ణువర్ధన్‌రెడ్డి, ఆదినారాయణ రెడ్డి, సీఎం రమేష్, సత్యకుమార్, భాను ప్రకాష్‌రెడ్డి.. ఇటు కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో చూసుకుంటే పురందేశ్వరి, కామినేని శ్రీనివాస్, జీవీఎల్ నరసింహారావు, అటు ఉత్తరాంధ్రలో చూసుకుంటే.. విష్ణుకుమార్ రాజు, మాధవ్ వంటివారు ఉన్నారు. అయితే.. వీరు కాదు.. ఇప్పుడు బీజేపీకి అసలు బలం అంటున్నారు పరిశీలకులు. బీజేపీకి వేరే ప్రధాన మైన బలం ఉందని చెబుతున్నారు. అదే.. ఆ పార్టీని విమర్శించేవారు.. వ్యతిరేకించేవారు లేక పోవడం. ప్రధాన పార్టీలను తీసుకుంటే.. టీడీపీ ఇప్పుడు బీజేపీతో పొత్తు పెట్టుకుంది. ఇక, వైసీపీ ఇంతకాలం రాష్ట్రం కోసం మోడీతో సామరస్యంగానే ఉంది. ఎన్నో చట్టాల కు కూడా వైసీపీ ఎంపీలు మద్దతిచ్చారు. సో.. తాము ఏ పార్టీతో పొత్తు పెట్టుకున్నా.. రెండుప్రధాన పార్టీల నుంచి ఎలాంటి విమర్శలు రావని బీజేపీ భావిస్తోంది. ముందు వైసీపీతోనే కలిసి ముందుకు సాగాలని బీజేపీ ప్లాన్ చేసింది. కానీ, వైసీపీ ఒప్పు కోలేదు. దీంతో టీడీపీ ముందుకు రావడం పవన్ రాయబారాలతో బీజేపీ టీడీపీతో కలిసి ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలో వైసీపీ బీజేపీని టార్గెట్ చేసే ధైర్యం లేదు. ఏదైనాఉంటే టీడీపీనే విమర్శిస్తుంది.

సో.. మొత్తంగా చూస్తే.. ఏమీలేని కాంగ్రెస్ చేసే విమర్శలు బీజేపీని ఏమీ చేయలేవు. కాబట్టి.. బీజేపీ బలం అంతా.. అసలు వ్యతిరేకత లేకపోవ డమే. ప్రజలు ఎలాంటి తీర్పు ఇస్తారనేది తర్వాత మాట. ఈ విషయంలో మాత్రం ఫస్ట్ స్టేప్‌లో బీజేపీ సక్సెస్ అయింది.

# బీజేపీ రెండో జాబితాను విడుదల

## తెలంగాణ నుంచి 6గురు అభ్యర్థుల పేర్లనుప్రకటించిన బీజేపీ




హైదరాబాద్ :దేశవ్యాప్తంగా 543 లోక్‌సభ స్థానాలు ఉండగా తొలి జాబితాలో 195 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ, 72 మందితో రెండో జాబితా ను విడుదల చేసింది. ఈ రెండో జాబితాలో తెలంగాణ నుంచి మొత్తం ఆరుగురు అభ్యర్థులను ప్రకటించారు. మెదక్? నుంచి రఘునందన్?రావు పేరు ప్రకటించగా, మహబూబ్‌నగర్ నుంచి డీకే అరుణ, ఆదిలాబాద్? నుంచి గోడెం నగేశ్, పెద్దపల్లి నుంచి గోమాస శ్రీనివాస్?, నల్గొండ నుంచి సైదిరెడ్డి, మహబూబాబాద్ నుంచి సీతారాం నాయక్ పోటీలో ఉన్నారు. రెండు జాబితాల్లో కలిపి తెలంగాణలోని మొత్తం 17 స్థానాల్లో 15 స్థానాలకు అభ్యర్థులను బీజేపీ ఖరారు చేసింది. ఇంకా ఖమ్మం, వరంగల్? స్థానాలను మాత్రమే బీజేపీ పెండింగ్?లో పెట్టింది.మొదటి జాబితాలో పెండింగ్‌లో ఉంచిన ఆదిలాబాద్? సిట్టింగ్? స్థానాన్ని ఎంపీ సోయం బాపూరావుకు ఇవ్వకుండా బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన గోడెం నగేశ్ పార్టీ అధిష్ఠానం ఇచ్చింది. అలాగే బీఆర్ఎస్ మాజీ ఎంపీ సీతారాం నాయక్‌కు మహబూబాబాద్ లోక్‌సభ టికెట్‌ను కన్ఫామ్ చేసింది. అనుకున్నట్లుగానే మెదక్? నుంచి అసెంబ్లీ ఎన్నికలో ఓటమి పాలైన రఘునందన్‌రావుకు అవకాశం ఇచ్చారు. మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానం నుంచి డీకే అరుణ పోటీ చేయనున్నారు. ముందు నుంచి అనుకున్నట్లుగానే బీజేపీ అభ్యర్థులను ప్రకటించింది.




దిల్లీ: రాజకీయ పార్టీలకు నిధులు సమకూర్చిన ఎన్నికల బాండ్ల వివరాలను భారతీయ స్టేట్ బ్యాంక్ బుధవారం సుప్రీంకోర్టుకు తెలిపింది. న్యాయస్థానం ఆదేశాల మేరకు ఈ డేటాను ఎస్‌బీఐ నిన్న కేంద్ర ఎన్నికల సంఘాని(ఈసీ)కి అందజేసిన సంగతి తెలిసిందే. తాజాగా దీనిపై బ్యాంకు సర్వోన్నత న్యాయస్థానానికి అఫిడవిట్ సమర్పించింది.

ఏప్రిల్ 1, 2019 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 15 వరకు మొత్తంగా 22,217 ఎన్నికల బాండ్లను జారీ చేసినట్లు వెల్లడించింది. "కోర్టు ఆదేశాల మేరకు గత ఐదేళ్లలో మేం జారీ చేసిన ఎన్నికల బాండ్లకు సంబంధించిన అన్ని వివరాలను మార్చి 12న ఈసీకి ఇచ్చాం. ఈ బాండ్లను ఎవరెవరు ఎంత కొనుగోలు చేశారు? ఏ పార్టీలు ఎంత ఎన్‌క్యాష్ చేసుకున్నాయి?వంటి వాటిని అందించాం" అని ఎస్‌బీఐ ఛైర్మన్ దినేశ్ కుమార్ అఫిడవిట్ సమర్పించారు. గత నెల ఎన్నికల బాండ్ల పథకాన్ని సుప్రీంకోర్టు రద్దు చేసిన సంగతి తెలిసిందే.

**ఎన్నికల బాండ్ల వివరాలు ఈసీ చేతికి :** 2019 ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఫిబ్రవరి 15, 2024 వరకు మొత్తం 22,217 ఎన్నికల బాండ్లను దాతలు కొనుగోలు చేసినట్లు ఎస్‌బీఐ తమ అఫిడవిట్‌లో పేర్కొంది. ఇందులో 22,030 బాండ్లను పలు రాజకీయ పార్టీలు ఎన్‌క్యాష్ చేసుకుని నిధులు తీసుకున్నట్లు తెలిపింది. మిగతా 187 బాండ్లను నిబంధనల ప్రకారం రిడీమ్ చేసి ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధిలో డబ్బు జమ చేసినట్లు వెల్లడించింది. అయితే, వీటితో ఏ పార్టీకి ఎన్ని నిధులు దక్కాయన్నదానిపై ప్రస్తుతానికి పూర్తి స్పష్టత లేదు. సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల ప్రకారం.. ఈ నెల 15 సాయంత్రం 5గంటల్లోగా ఈసీ ఈ సమాచారాన్ని వెబ్‌సైట్‌లో బహిరంగపరచాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వం 2018లో ఎన్నికల బాండ్ల పథకాన్ని తీసుకొచ్చినప్పటి నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు 30 విడతల్లో ఎస్‌బీఐ వీటిని విక్రయించింది. వ్యక్తులు/సంస్థలు వీటిని కొనుగోలు చేసి అర్హత కలిగిన రాజకీయ పార్టీలకు నిధుల కింద అందించాయి. నిబంధనల ప్రకారం.. జారీ అయిన తేదీ నుంచి 15 రోజుల వరకే ఇవి చెల్లుబాటవుతాయి. ఆలోగా రాజకీయ పార్టీలు వాటిని ఎన్‌క్యాష్ చేసుకోవాలి. గడువు ముగిసిన తర్వాత మిగిలిపోయిన బాండ్లకు చెందిన నగదును పీఎం రిలీఫ్ ఫండ్‌కు జమ చేస్తారు.




## అయోధ్య రామ మందిరానికి రోజు ఎంత మంది వస్తున్నారో తెలిపిన ఆలయ ట్రస్ట్

**అయోధ్యలో రామ మందిరానికి జనవరి 22న ప్రాణప్రతిష్ట కార్యక్రమం జరిగినప్పటి నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి తరలివస్తున్నారు. అంతేకాదు భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయం దర్శన సమయాన్ని కూడా మార్చారు. ట్రస్ట్ దర్శన సమయాన్ని ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటలకు పెంచారు. ఈ నేపథ్యంలో ప్రతిరోజు సగటున రామ మందిరానికి లక్ష నుంచి 1.5 లక్షల మంది వస్తున్నారని శ్రీరామ జన్మభూమి తీర్థ్ క్షేత్ర ట్రస్ట్ వెల్లడించింది.**




'మిషన్ దివ్యాస్త్ర'లో భాగంగా అగ్ని-5 క్షిపణికి సంబంధించి నిర్వహించిన తొలి ఫ్లైట్ టెస్ట్ విజయవంతమైన విషయం తెలిసిందే. దీనిపై తాజాగా రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ మాజీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ వీకే సరస్వత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇది భారతదేశపు సెకండ్-స్ట్రైక్ సామర్థ్యాన్ని మరో స్థాయికి తీసుకెళ్లిందని కొనియాడారు. ఇది భారత్‌కు గేమ్ ఛేంజర్‌గా నిలుస్తుందని పేర్కొన్నారు. ఇది ఒక క్షిపణితో భారీ వినాశనాన్ని సృష్టిస్తుందని చెప్పారు. దీని పుణ్యమా అని భవిష్యత్తులో శత్రు దాడికి వ్యతిరేకంగా తక్కువ క్షిపణులు ప్రయోగించవచ్చని తెలిపారు. దీనిని ఫోర్స్ మల్టిప్లైయర్ అంటారని వివరించారు. ఇది ఆయుధ ప్రభావ సామర్థ్యాన్ని పెంచుతుందని అన్నారు.

**చైనాకు చెక్ ఎలా? :** ప్రస్తుతం చైనా వద్ద డాంగ్‌ఫెంగ్-41 పేరుతో కొన్ని క్షిపణులు ఉన్నాయి. ఇవి 12,000 కి.మీ నుంచి 15,000 కి.మీ రేంజ్‌లోని లక్ష్యాలను ఛేదించగలవు. అందుకు పోటీగానే భారత్ 'అగ్ని-5' క్షిపణి ప్రాజెక్ట్‌ను చేపట్టింది. 5వేల కి.మీలకు మించిన దూరంలోని లక్ష్యాలను ఛేదించగలిగే సత్తా ఈ మిస్సైల్‌కు ఉంది. ఇది చైనా ఉత్తర భాగం, యూరప్‌లోని కొన్ని ప్రాంతాలతో పాటు ఆసియా ఖండంలోని పలు దేశాలను టార్గెట్ చేయగలదు. మల్టిపుల్ ఇండిపెండెంట్లీ టార్గెటబుల్ రీ ఎంట్రీ వెహికల్ (ఎంఐఆర్‌వీ) టెక్నాలజీతో పనిచేసేలా ఈ మిస్సైల్‌ను DRDO తయారు చేసింది. దీంతో.. ఈ సాంకేతికత కలిగిన యునైటెడ్ స్టేట్స్, యునైటెడ్ కింగ్‌డమ్, చైనా, రష్యా వంటి దేశాల జాబితాలో మన భారత్ చేరిపోయింది.

**ప్రధాని మోదీ అభినందనలు :** అగ్ని-5 క్షిపణి తొలి ఫ్లైట్ టెస్ట్ సక్సెస్ కావడంతో.. DRDO శాస్త్రవేత్తలను ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా కొనియాడారు.

మల్టిపుల్ ఇండిపెండెంట్లీ టార్గెటబుల్ రీ-ఎంట్రీ వెహికల్ సాంకేతికతతో రూపొందించిన అగ్ని-5 క్షిపణిని విజయవంతంగా ప్రయోగించడం.. మన దేశ రక్షణ సంసిద్ధత, వ్యూహాత్మక సామర్థ్యాలను పెంపొందించడంలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందని కూడా పేర్కొన్నారు.

DRDO శాస్త్రవేత్తలను చూసి గర్విస్తున్నానని అన్నారు. రాష్ట్రపతి ముర్ము సైతం ఈ ప్రయోగాన్ని ఓ మైలురాయిగా అభివర్ణించారు. భారత్ మరింత గొప్ప భౌగోళిక-వ్యూహాత్మక సామర్థ్యాల దిశగా సాగుతున్న ప్రయాణంలో.. ఇదొక ముఖ్యమైన మైలురాయి అని పేర్కొన్నారు.

## సీఎం ను కలిసిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్



**హైదరాబాద్ మార్చి 13(ప్రభాత సమాచారం)** ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్ బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. నియోజకవర్గం లోని పలు సమస్యలను అయన దృష్టికి తీసుకొచ్చారు. ఆయన వెంట నిర్మల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీహరి రావు ఉన్నారు

## చౌటపల్లి యుపిఎస్ పాఠశాలకు ప్యూరిఫైయర్ వాటర్ ట్యాంక్ అందజేత



**తాండూర్, మార్చి13(ప్రభాత సమాచారం)** చౌటపల్లి గ్రామపంచాయతీ సోలార్ టాటాచౌటపల్లి విద్యార్థుల కోసం రూ.2లక్షల పైన విలువ గల పూరీఫైర్ వాటర్ ట్యాంక్ అందజేశారు. కార్యక్రమంలో శేఖర్ కుమార్, ఎస్ సురేష్, ప్రవీణ్, రామకృష్ణ, శంకర్, అషమ్, చౌటపల్లి యుపిఎస్ ప్రాథనోపాధ్యాయులు పి విశ్వనాథం మరియు చక్రపాణి, దేవదాస్, చీమల శంకర్, ముదం రఘు,చీమల మహేష్, ఎనగందుల నరేష్, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

## పోషక ఆహారం మిల్లెట్స్ పై తల్లులకు అవగాహన



**తాండూర్, మార్చి13(ప్రభాత సమాచారం)** తాండూర్ మండలం లోని రెపల్లెవాడ అంగన్వాడీ సెంటర్ లో బుధవారం పోషన్ పక్వాడ ప్రోగామ్ నిర్వహించి తల్లులకు ఆరోగ్యవంతమైన పోశాకాహారం మరియు మిల్లెట్స్ పై అవగాహనా కల్పించడం జరిగింది. 6 నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసన చేస్తూ వారికి 7నెలల నుంచి అదనపు పౌస్టికాహారం అందించాలని తల్లులకు తెలిజేయడం జరిగింది. ఈ కార్యక్రమం ఈ నెల 9వ తేదీ నుండి 23వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు.ఈ కార్యక్రమం లో సిడీపీవో ఉమాదేవి,ఆయా, తల్లులు,పిల్లలు, పాల్గొన్నారు.

## దేవాపూర్ అంగన్వాడిలో చిరుధాన్యాల అవగాహన



**తలమడుగు మార్చ్ 13(ప్రభాత సమాచారం)** చిన్నారులకు తల్లులు పౌష్టిక ఆహారాన్ని అందించాలని సూపర్వైజర్ విజయలక్ష్మి అన్నారు. తలమడుగు మండలంలోని దేవాపూర్ గ్రామంలో గల అంగన్వాడి కేంద్రంలో బుధవారం రోజు చిరుధాన్యాల అవగాహన సదస్సు నిర్వహించారు అనంతరం సైకిల్ ర్యాలీ నిర్వహించి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ విజయలక్ష్మి, అంగన్వాడీ టీచర్లు భాగ్యమ్మ, ఉమాదేవి, విజయ ఏఎన్ఎం వెంకటమ్మ ఆశా వర్కర్ రేణుక గ్రామస్తులు తదితరులున్నారు.

## 'దేశాన్ని విభజించేందుకే బీజేపీ సీఏఏని తెచ్చింది'


పౌరసత్వ సవరణ చట్టాన్ని అమల్లోకి తీసుకురావడంపై కేంద్ర ప్రభుత్వం మీద సినీ నటుడు, మక్కల్ నీది మయ్యమ్ (ఎంఎన్ఎం) పార్టీ చీఫ్ కమల్ హాసన్ నిప్పులు చెరిగారు. దేశాన్ని విభజించేందుకే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకొచ్చిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఎన్నికల ముందు ప్రజలను విభజించి, భారతదేశ సామరస్యాన్ని నాశనం చేయడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. రాబోయే ఎన్నికల్లో విజయం సాధించాలనే తపనతో.. ఎన్నికల సందర్భంగా సీసీఏను హడావుడిగా తెచ్చింది" అని ఆయన చెప్పారు. ఈ చట్టం రాజ్యాంగ చెల్లుబాటును సుప్రీంకోర్టు నిర్ణయిస్తుంది కాబట్టి.. నోటిఫికేషన్‌ని విడుదల చేసిన సమయం మరింత సందేహాస్పదంగా ఉందని కమల్ హాసన్ అనుమానం వ్యక్తం చేశారు.

# మూల కణం విలువ ఘనం!

కొత్తగూడెం : పుట్టబోయే బిడ్డ కలకాలం ఆరోగ్యంగా ఉండాలనేదే ప్రతి తల్లి తపన. భవిష్యత్తులో తన బిడ్డలో ఏదైనా అవయవం దెబ్బతింటే? ఒక్క కణంతో అవయవాన్ని మళ్లీ సృష్టించవచ్చునని, ఆ కణం బిడ్డకు ఆహారమందించే బొడ్డుతాడులోనే ఉందని తెలిస్తే ఇంకేముంది.. ఒడిలో తన బిడ్డవలే పదిలంగా దాస్తుంది. మున్ముందు బిడ్డ శరీరానికి చెందిన ఏ అవయవాన్నైనా పునరుత్పత్తి చేయగలిగే సామర్థ్యం బొడ్డుతాడులోని మూలకణాలకు ఉంటుందని వైద్యనిపుణులు చెబుతున్నారు. ప్రసవ సమయంలో మాత్రమే సాధ్యమయ్యే బొడ్డుతాడు సేకరణపై కాబోయే తల్లిదండ్రులకు అవగాహన అవసరమంటున్నారు. ప్రసవం జరగ్గానే కత్తిరించి పక్కన పడేసే బొడ్డుతాడులో 100 మి.లీ. రక్తం ఉంటుంది. బిడ్డ నుంచి వేరుచేసిన రెండు నిమిషాల్లోనే అందులోని రక్తాన్ని సేకరించి నమూనాలను మైనస్ 196 డిగ్రీల ఉష్ణోగ్రత కలిగిన లిక్విడ్ నైట్రోజన్ బ్యాంకులో భద్రపరుస్తుంటారు. సీసాపై బార్ కోడింగ్, డోనర్ పేరు నమోదుచేస్తారు. ఇవి వందేళ్ల వరకు నిల్వ ఉంటాయి. ప్రస్తుతం హైదరాబాద్ వంటి నగరాలకే ఈ బ్యాంకులు పరిమితమయ్యాయి. తమ బిడ్డ మూల కణాలను భద్రపరచాలనుకునే తల్లిదండ్రులు సంబంధిత స్టెమ్ సెల్స్ బ్యాంకు సిబ్బందిని సంప్రదిస్తే ప్రసవ సమయంలో వాళ్లొచ్చి బొడ్డుతాడు నుంచి రక్తం సేకరిస్తారు. ప్రసవం జరిగిన ఆరేడు గంటల్లోపు నమూనాలను లిక్విడ్ నైట్రోజన్‌లో భద్రపరచాల్సిందే.

నమూనాల సేకరణలో వృద్ధి

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో నిత్యం వందలాది ప్రసవాలు జరుగుతున్నా 2022 వరకు ఏటా పదుల సంఖ్యలో మాత్రమే మూల కణం



నమూనాలు సేకరించేవారు. 2023 నుంచి ప్రతినెలా కనీసం ఆరేడు నమూనాలు సేకరిస్తున్నామని వివిధ బ్యాంకుల ప్రతినిధులు చెబుతున్నారు. ఇప్పటివరకు సేకరించిన వాటిలో రెండు నమూనాలను హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరు చిన్నారులకు అందించినట్లు వెల్లడించారు.

ఎందుకంత ప్రాధాన్యం..?

శిశువు జన్మించాక బొడ్డుతాడులో కొంత రక్తం మిగిలి ఉంటుంది. దీన్నే 'కార్డ్ బ్లడ్' అంటారు. ఒకప్పుడు బొడ్డుతాడును వ్యర్థంగా పరిగణించేవారు. దీంట్లో మూల కణాలు (హెమటోపోయిటిక్ స్టెమ్ సెల్స్) ఉంటాయని పరిశోధనల్లో రుజువైంది. మూల కణాలతో సికిల్ సెల్, తలసీమియా, ల్యుకేమియా తదితర 80పైగా వ్యాధులను నయం చేయవచ్చునని నిపుణులు చెబుతున్నారు. 'ఇటీవల చాలామంది పిల్లలు రక్త రుగ్మతలతో జన్మిస్తున్నారు. సాధారణంగా వారికి రక్తమార్పిడి అవసరం. రక్తం మార్చకుండా వ్యాధులను నయం చేసేందుకు మూల కణాలు శక్తిమంతంగా ఉపకరిస్తాయి' అని వివరిస్తున్నారు. బ్యాంకుల్లో డబ్బు దాచుకుని అవసరమైనప్పుడు తీసి వాడుకున్నట్లే.. ఏదైనా అవయవం దెబ్బతిన్నా, క్యాన్సర్ వంటి వ్యాధులు వచ్చినా మూల కణాలను వినియోగించుకోవచ్చు. మొదటి బిడ్డ మూల కణాలను భద్రపరచలేకపోయిన తల్లిదండ్రులు తమ రెండో బిడ్డ మూల కణాలను నిల్వ ఉంచితే వాటిని ఇద్దరికీ ఉపయోగించుకోవచ్చునని నిపుణులు సూచిస్తున్నారు.

రూ.75 వేలకు 75 ఏళ్లు

ప్రస్తుతం కొన్ని ప్రైవేటు సంస్థలు మాత్రమే మూల కణాలను భద్రపరిచే బ్యాంకులను నిర్వహిస్తున్నాయి. ఆయా బ్యాంకుల సేవలపై ఖర్చు ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన ఓ సంస్థ 75ఏళ్లు భద్రపరచటానికి రూ.75వేలు తీసుకుంటోంది. నిల్వ చేసిన మూల కణాలను దాత కుటుంబానికి అవసరమైనప్పుడు ఇస్తోంది. హైదరాబాద్‌కు చెందిన కొన్ని సంస్థలు మూల కణాలను 21ఏళ్ల పాటు నిల్వ ఉంచటానికి రూ.50వేలు వసూలు చేస్తున్నట్లు సమాచారం.

# ఏమార్చుతున్నారు!

గద్వాల : గద్వాలలోని విద్యుత్తు శాఖలో తొమ్మిదేళ్లపాటు జరిగిన డీడీల అక్రమాల భాగోతం వెలుగుచూసినప్పటికీ బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో ఉన్నతాధికారులు నేటికీ మీనమేషాలు లెక్కిస్తున్నారు. సాక్షాత్తు విజిలెన్స్ విచారణలో అవినీతి జరిగినట్లు తేలినా చర్యలు మాత్రం శూన్యమే. మరోవైపు అక్రమార్కులు ఆ మొత్తాలను పుస్తకాల్లో సర్దుబాట్లు చేస్తూ మార్పులు చేసి ప్రభుత్వాన్ని ఏమార్చేందుకు ప్రయత్నిస్తున్నారు.


అమాయకత్వం ఆసరాగా..:

2011 మే నెల నుంచి 2019 వరకు డీడీల స్కాం జరిగినట్లు విజిలెన్స్ విచారణలో బట్టబయలైంది. ఒక వినియోగదారుడు తన పనుల నిమిత్తం తానే సొంతంగా బ్యాంక్‌లో డీడీ కట్టి, ఆ డిమాండ్ డ్రాఫ్ట్‌ను విద్యుత్తు శాఖ కార్యాలయంలోని సంబంధిత అధికారులకు అందజేయాలి. కానీ కొంతమంది నిరక్షరాస్యులు తమకు డీడీ కట్టడంపై అవగాహన లేకపోవడంతో విద్యుత్తు సిబ్బందికే నేరుగా నగదు చెల్లిస్తుంటారు. దీనిని ఆసరాగా చేసుకుని అప్పటి అకౌంట్స విభాగంలో పనిచేస్తున్న కొంతమంది సిబ్బంది చేతివాటానికి తెరతీశారు. వినియోగదారుడి పనికి సంబంధించి ఒక డీడీ తీశాక దాని నంబర్‌ను విద్యుత్తుశాఖ కార్యాలయంలోని రికార్డుల్లో అతను చెల్లించినట్లుగా నమోదు చేయాలి. ఇక్కడ నమోదు చేసిన డీడీ నంబర్‌తోనే తర్వాత ఇతర పనులకు వేరే వినియోగదారులు చెల్లించే డబ్బులను పక్కదారి పట్టిస్తూ అదే నంబర్ ఇతర పనులకు కూడా నమోదు చేసినట్లు కాలక్రమంలో బయటపడింది. ఇతరత్రా విధానాల్లోనూ సుమారు దశాబ్దకాలంపాటు వందలాది డీడీలను పక్కదారి పట్టించినట్లు అధికారుల విచారణలో తేలింది.

చర్యలు తీసుకోవాలన్నా..

అకౌంట్స్ విభాగంలో పని చేసే ఒక ఉద్యోగి 2019లో ఈ డీడీల భాగోతాన్ని అప్పటి ఎస్‌ఈ చక్రపాణి, డీఈ మోహన్ దృష్టికి తీసుకెళ్లారు. రూ.58లక్షలకుపైగా పక్కదారి పట్టినట్లు వీరు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర అధికారులు విచారణ చేయాల్సిందిగా విజిలెన్స్ డీఈ ఉమాదేవిని ఆదేశించారు. ఆమె రికార్డులను పరిశీలించి ఇది క్రిమినల్ పరిధిలోకి వస్తుందని తేల్చిచెప్పారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాల్సిందిగా ఆదేశించారు. కానీ ఉన్నతాధికారుల దాన్ని పట్టించుకోలేదు. నిజానికి 2011కు ముందు నుంచే డీడీల అక్రమాలు రూ.కోట్లలో జరిగినట్లు ఆరోపణలున్నాయి. విజిలెన్స్ అధికారులు 2020లో విచారణ జరిపారు. 2023 మే నెలలో ఇచ్చిన తుది నివేదికలో 368 డీడీలకు సంబంధించి రూ.21.11 లక్షలు మాత్రమే స్కామ్ జరిగిందని పేర్కొన్నారు. నిజానికీ రూ.58 లక్షలకుపైగా జరిగినా, అధికారులు రూ.30లక్షలకుపైగా డబ్బులను జనరల్ ఎంట్రీ కింద తగ్గించినట్లు తెలిసింది.

# ఆహ్లాదం పంచేదెన్నడో..?



కరీంనగర్ : పర్యాటకులు, విద్యార్థులు, ప్రజలకు విజ్ఞాన విహార యాత్రలకు వేదికగా రూపుదిద్దుకున్న సిరిసిల్ల అర్బన్ ఫారెస్ట్‌పార్కు ఆహ్లాదాన్ని పంచేదెప్పుడో తెలియని సందిగ్ధత నెలకొంది. పచ్చని చెట్లు, అందులో ఆకట్టుకునే కళాకృతుల నడుమ మానసిక ఉల్లాసాన్ని కలిగించడంతోపాటు అడవులు, అందులోని వివిధ రకాల జీవుల మనుగడపై విజ్ఞానాన్ని అందించేలా అద్భుతంగా తీర్చిదిద్దిన పార్కు ఇంకా ప్రారంభానికి నోచుకోవడం లేదు. పార్కులోని వివిధ నిర్మాణాలు రంగులు వెలిసిపోయి, కళావిహీనంగా మారుతున్నాయి.

50 హెక్టార్లలో..

ఎల్లారెడ్డిపేట మండలంలోని పోతురెడ్డిపల్లి రిజర్వు ఫారెస్ట్ బ్లాకులో 581.03 హెక్టార్ల అటవీ విస్తీర్ణముండగా అందులోని 50 హెక్టార్లను అర్బన్ ఫారెస్ట్ పార్కు నిర్మాణానికి కేటాయించారు. ఇందులో 30 శాతం ఎర్రనేలలు ఉండగా మిగితా 70 శాతం గుట్ట ప్రాంతంగా ఉంది. 20 హెక్టార్ల విస్తీర్ణంలో పార్కు, 30 హెక్టార్లలో వివిధ రకాల మొక్కలను పెంచాలని నిర్ణయించారు. పార్కు నిర్మాణానికి మాజీ మంత్రి కేటీఆర్ 2020 జూన్ 26న మాజీ శాసనసభాపతి పోచారం శ్రీనివాసరెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. రూ.30 లక్షల కాంపా పథకం నిధులతో దాదాపు 900 మీటర్ల పొడవునా చైన్‌లింక్ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. రూ.64 లక్షల హరితహారం నిధులతో యోగాషెడ్డు, గజిబో (సందర్శకులు కూర్చునే నిర్మాణం), ఎంట్రెన్స్‌ప్లాజా, ప్రహరీ, టికెట్ కౌంటర్, వాచ్‌మెన్ గది, లేక్‌డెక్, అంతర్గత రహదారులను నిర్మించడంతో పాటు సోలార్ పంపుసెట్టు, సోలార్ విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేశారు. రూ.1.03 కోట్ల మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ నిధులనూ వెచ్చించారు. ఈ నిధులతో అల్ఫాబెట్ పార్కు, ఓపెన్ క్లాస్‌రూమ్, పిక్నిక్ ఏరియాను తయారు చేశారు. ఆర్టిస్టిక్ బెంచీలు, కార్తీకవనం, బటర్‌ఫ్లై గార్డెన్, చిల్డ్రన్స్ ప్లే ఏరియా, మూత్రశాలలు, మరుగుదొడ్లు, చెత్తబుట్టలు, సూచికలు, పంచతత్వ పార్కు, హెర్బల్ గార్డెన్, వ్యూటవర్‌లను నిర్మించారు.

నాలుగేళ్లుగా నిర్మాణం

అర్బన్ ఫారెస్ట్ పార్కులో ఆయా నిర్మాణాలతో పాటు సందర్శకులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. పార్కులో వివిధ రకాల మొక్కల పెంపకాన్ని చేపడుతూ అబ్బురపరిచే వివిధ సౌకర్యాలను నాలుగేళ్లుగా కల్పిస్తున్నారు. హెర్బల్‌గార్డెన్‌తో పాటు స్కల్ప్చర్‌పార్కు, అడవులపై అవగాహన కల్పించేందుకు థియేటర్, ప్రొజెక్టర్‌తో కూడిన అవుట్‌డోర్ తరగతి గదులు (ఈఈసీ), అడ్వెంచర్‌పార్కు, ట్రీహౌజ్, అవుట్‌డోర్ జిమ్, కానాపీ వాక్‌వే, రోప్ బ్రిడ్జి, రెయిన్‌ఫారెస్ట్, మంచినీటి ట్యాంకులు, పిల్లల కోసం రోప్ క్లైంబర్స్ లాంటివి ఏర్పాటు చేయాలని తొలుత భావించినా కార్యరూపం దాల్చలేదు. ఇప్పటికే లేక్‌డెక్‌లో నీరులేక వెలవెలబోతుండగా అక్కడి నిర్మాణం రంగు కోల్పోయింది. చెట్ల నడుమ పిక్నిక్ ఏరియాలో నెలకొల్పిన ఆర్టిస్టిక్ బెంచీలు సైతం రంగులు వెలిసిపోయి కళావిహీనంగా మారుతున్నాయి.

ఇటీవలే ట్రయల్ రన్

– శ్రీనివాస్‌రావు, అటవీక్షేత్రాధికారి, సిరిసిల్ల

ఇప్పటి వరకు విడుదలైన నిధులతో సిరిసిల్ల అర్బన్ ఫారెస్ట్ పార్కును సిద్ధం చేశాం. ఇటీవల ట్రయల్ రన్ నిర్వహించాం. టికెట్ కౌంటర్‌లు నడిపించే విధానం, సందర్శకులతో మెదిలే విధానంపై వాచర్‌లకు అవగాహన కల్పించాం. వ్యూటవర్ నిర్మాణం పనులు కొంతమేర మిగిలి ఉండగా వాచ్‌టవర్ నిర్మాణ పనులు టెండర్ దశలో ఉన్నాయి. అధికారికంగా ప్రారంభించిన తర్వాత పార్కులోకి సందర్శకులను అనుమతిస్తాం.

# మత్తు వీడటం లేదు!



పెద్దపల్లి : 'క్షేత్ర స్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి జిల్లాలోని మద్యం గొలుసు(బెల్టు) దుకాణాలను మూసివేసేలా వెంటనే చర్యలు తీసుకోవాలి.'

నాలుగు రోజుల కిందట కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినా క్షేత్ర స్థాయి పరిస్థితుల్లో ఏ మాత్రం మార్పు లేదు. పల్లెల్లో బెల్టు దుకాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. రామగుండం, గోదావరిఖని, పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ పట్టణ ప్రాంతాలతో పాటు మండలకేంద్రాల్లోని లైసెన్స్‌డ్ దుకాణాల నుంచి పెద్ద ఎత్తున మద్యం నిల్వలు తీసుకొచ్చి సమీప గ్రామాల్లో జోరుగా విక్రయిస్తున్నారు. మందుబాబుల నుంచి ఎమ్మార్పీ కంటే ఎక్కువ వసూలు చేస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. ఈ వ్యవహారం నెలనెలా ఎక్సైజ్, పోలీసు, ఇతర శాఖల అధికారులకు 'మామూలు'గానే తోస్తుండటంతో బెల్టు దుకాణాల జోలికి వెళ్లడం లేదనే విమర్శలున్నాయి. అలాగే బెల్టు దుకాణాల నిర్వాహకులు మద్యాన్ని కల్తీ చేయడంతో పాటు నాసిరకమైన తినుబండారాలు, కుళ్లిన మాంసంతో చేసిన పదార్థాలు విక్రయిస్తున్నా పట్టించుకున్న వారు లేరు. బెల్టు దుకాణాలు నిర్వహించకుండా చర్యలు చేపట్టాల్సిన ఆబ్కారీ శాఖకు ఇవేవీ పట్టడం లేదు.

పల్లెల్లో నిత్యం గొడవలు

గ్రామాల్లో బెల్టు దుకాణాల నిర్వహణతో ఎక్కువగా పేదలు, కూలీలు మద్యానికి బానిసలవుతున్నారు. దీంతో గొడవలు, కుటుంబ తగాదాలు, హత్యలు, భౌతిక దాడులు పరిపాటిగా మారాయి. 24 గంటల పాటు మద్యం అందుబాటులో ఉండటం, సెలవు, ప్రత్యేక దినాల్లోనూ దొరుకుతుండటంతో పేదలు ఇళ్లు, ఒళ్లు గుల్ల చేసుకుంటున్నారు. బెల్టు దుకాణాలను మూసివేసేలా చర్యలు తీసుకోవాలంటూ గతంలో ప్రజావాణిలో సైతం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు పలు గ్రామాల మహిళలు వినతిపత్రాలు అందజేశారు. బెల్టు దుకాణాల మూలంగా కుటుంబ సమస్యలు పెరిగాయని, వాటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలంటూ విన్నవిస్తున్నారు. వీటన్నింటినీ పరిశీలించిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆబ్కారీ అధికారులతో సమావేశమయ్యారు. నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

అది సందేశమేనట!

జిల్లాలో లైసెన్సుడ్ మద్యం దుకాణాలు 77 ఉన్నాయి. వీటికి అనుబంధంగా నిర్వహిస్తున్న వందలాది బెల్టు దుకాణాలు గ్రామీణ ప్రజల ఆరోగ్యాన్ని కబళిస్తున్నాయి. నిబంధనల ప్రకారం అనుమతి ఉన్న వైన్స్, బార్‌లలో మాత్రమే మద్యం విక్రయించాల్సి ఉంటుంది. అనుమతి కలిగిన ప్రతి దుకాణానికి సంబంధించి విక్రయాలు, స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. బెల్టు దుకాణాల మూసివేతకు చర్యలు తీసుకోని ఆబ్కారీ శాఖ అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ విషయమై ఆబ్కారీ శాఖ జిల్లా పర్యవేక్షకుడు మహిపాల్‌రెడ్డితో మాట్లాడగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన తమ శాఖ అధికారులకు కలెక్టర్ సూచనలు చేశారన్నారు. ఈ క్రమంలో విధుల నిర్వహణపై సందేశమిచ్చారని, ఇప్పటివరకు ఏ ఒక్క గొలుసు దుకాణాన్నీ తొలగించలేదని తెలిపారు.

# మొక్కలు బతికేదెలా..!

ధన్వాడ : ఈ నర్సరీ ధన్వాడ మండలంలోని రాంకిష్టాయపల్లి గ్రామానికి చెందినది. మొన్నటి దాకా మొక్కల పెంపకానికి వైకుంఠధామానికి చెందిన బోరు ద్వారా నీరు అందించేవారు. అయితే ఉన్నట్టుండి ఈ బోరు ఎండిపోయింది. ప్రస్తుతం మొక్కలకు నీరు అందించలేని పరిస్థితి. పంచాయతీ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. దీంతో డీజిల్ ఖర్చు ఎక్కువ అవుతుండటంతో నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు. మొక్కలు అంతంత మాత్రం గానే కనిపిస్తున్న ఈ నర్సరీ ధన్వాడ మండలంలోని మంత్రోనిపల్లి గ్రామానికి చెందినది. ఇక్కడ ప్రారంభం నుంచి మిషన్ భగీరథ నీటినే నర్సరీ నిర్వహణకు ఉపయోగిస్తున్నారు. గ్రామస్థుల తాగునీటి అవసరాలకు గత సర్పంచి తన సొంత బోరు ద్వారా నీటిని అందించేవారు. ఆమె పదవీ కాలం ముగియగానే సరఫరాను నిలిపేశారు. దీంతో గ్రామస్థులు మిషన్ భగీరథ నీటి పైనే ఆధారపడాల్సి వచ్చింది. దీంతో నర్సరీకి నీటి సరఫరా ఆగిపోయింది. పై రెండు గ్రామాలే కాదు ఇదే మండలంలోని కొండాపూర్‌లో నర్సరీ బోరు కూడా ఎండిపోయింది. గ్రామ పంచాయతీ ఎమ్మెల్యే సహకారంతో కొత్త బోరు వేశారు. ధన్వాడలోనూ నర్సరీ బోరు ఆశించిన స్థాయిలో నీరు అందించడంలేదు. ఎండిపోతున్న బోర్ల మూలంగా జిల్లాలో గ్రామ పంచాయతీ నర్సరీలకు గడ్డుకాలం నెలకొంది. ప్రత్యామ్నాయ చర్యలకు ఖర్చు భారీగా అవుతుండటంతో ఎలా ముందుకు వెళ్లాలో తోచక నిర్వాహకులు ఆందోళన పడుతున్నారు. పరిస్థితులు ఇలాగే ఉంటే హరితహారం లక్ష్యం మేరకు మొక్కల్ని అందించడం కష్టమేనన్న భావన వ్యక్తమవుతోంది. జిల్లాలో మొత్తం 280 గ్రామ పంచాయతీ నర్సరీలు ఉన్నాయి. 2023–24 ఏడాదికి గాను అన్ని చోట్ల కలిసి మొత్తం 33,60,000 మొక్కలు పెంచాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు వెళ్తున్నారు. గతేడాది పెద్దగా వర్షాలు పడకపోవడం, ప్రస్తుతం ఎండల తీవ్రత పెరగడం లాంటి కారణాలతో బోర్లు ఎండిపోతున్నాయి. దీంతో మొక్కలకు నీళ్లు అందడంలేదు. పలు చోట్ల పంచాయతీ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేపట్టిన ఇది భారమవుతున్నది. ధన్వాడ మండలంలోనే కాకుండా మరికల్, నారాయణపేట, మద్దూర్, దామరగిద్ద, ఊట్కూర్ తదితర మండలాల్లోనూ నర్సరీ బోర్లలో నీటి మట్టాలు పడిపోయాయి. మొక్కలకు నీళ్లు అందించేందుకు అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# నడక దారి.. ఇరుగ్గా మారి

నర్సాపూర్: పట్టణం మీదుగా 365–డి మెదక్– నర్సాపూర్– హైదరాబాద్ జాతీయ రహదారి నిర్మించారు. వంద అడుగుల వెడల్పుతో విస్తరించిన రోడ్డుకు ఇరువైపులా మూడు మీటర్ల చొప్పున ఫుట్‌పాత్‌లు ఏర్పాటు చేశారు. నడిచేవారు జాతీయ రహదారి మీదికి రాకుండా ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేశారు. వ్యాపారాలు సాగడం లేదని కొందరు వాటిని తొలగించారు. మరికొందరు ద్వారాలు చేసుకున్నారు. దీంతో ప్రజలు దుకాణాల నుంచి నేరుగా రోడ్డుపైకి వస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఫుట్‌పాత్‌ల ఆక్రమణతో దారి ఇరుగ్గా మారి సమస్య మళ్లీ మొదటికొచ్చింది. దుకాణాల ముందు మూడు మీటర్ల మేర ఆక్రమించి వ్యాపారులు కార్యకలాపాలు సాగిస్తున్నారు. గతంలో హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ కమిటీ రంగంలోకి దిగి కొన్ని ఆక్రమణలను తొలగించింది. పూర్తిస్థాయిలో తొలగించుకునేందుకు కొంత గడువిచ్చారు. సమస్య మాత్రం పరిష్కారం కాలేదు.

అడ్డగోలు ఆక్రమణలు

పట్టణంలోని వ్యాపారులు ఫుట్‌పాత్‌లపైనే వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. దుకాణాల్లోని సామగ్రి వాటి ముందున్న ఫుట్‌పాత్‌లపై పెట్టుకుంటున్నారు. చిరు వ్యాపారులు సైతం అక్కడే వ్యాపారాలు సాగిస్తున్నారు. కొన్ని దుకాణాల యజమానులు టీస్టాల్స్, స్నాక్స్, పానీపురి, మిర్చి, పునుగులు విక్రయించే తోపుడబండ్ల నిర్వాహకులకు అద్దెకిస్తున్నారు. వారి నుంచి రోజుకు రూ.300– 500 వరకు వసూలు చేస్తున్నారు. నడక దారి ఆక్రమణకు గురవుతున్నా పురపాలిక, పోలీసు అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. మెకానిక్‌లు సైతం ఫుట్‌పాత్‌లపైనే మరమ్మతులు చేస్తున్నారు. ప్రజలు వ్యాపార సంస్థల్లోకి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఇనుప గ్రిల్స్ లోపలి నుంచి కాలినడకన వెళ్లాలంటే నరకం అనుభవిస్తున్నారు. పట్టణంలో వాహనాలకు పార్కింగ్ స్థలాలూ లేవు. దుకాణాల్లోకి సామగ్రి తరలించే రవాణా వాహనాలు



వచ్చినప్పుడు రోడ్లపైనే నిలుపుతున్నారు. ఈ సమయంలో ప్రమాదాలు జరగడానికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం...– జాన్‌రెడ్డి, సీఐ, నర్సాపూర్

పట్టణంలో నడకదారులను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తే విచారించి తగిన చర్యలు తీసుకుంటాం. ముందుగా వ్యాపారులకు తాఖీదులు జారీ చేస్తాం. కొంత గడువు ఇచ్చాక వారిలో మార్పు రాకుంటే వాటిని తొలగింపజేస్తాం. జాతీయ రహదారిపై దుకాణాల ఏర్పాటు సరికాదు. ప్రమాదకారిగా ఉంటే జరిమానాలు విధిస్తాం.

# సమన్వయ లోపం.. తాగునీరు ప్రశ్నార్థకం!

ఆత్మకూరు : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తాగునీటి సమస్యలు తీవ్రమవుతున్నాయి. అవసరాలు తీర్చే జలాశయాలు అడుగంటుతున్నాయి. జలాశయాల్లో నిర్దేశించిన నీటిని నిల్వ చేయడం, వేసవిలో ప్రజలకు తాగునీటి అవసరాలు తీర్చడంలో ప్రభుత్వశాఖల మధ్య సమన్వయం లోపించింది. వర్షాకాలంలో సమకూరే వరదనీటిని పరిరక్షించడంలో ముందుచూపు లోపించింది. ఫలితంగా వేసవి ఆరంభంలోనే తాగునీరందించే జలాశయాల్లో నీటి పరిమాణాలు తగ్గుముఖం పట్టాయి. వేసవి ముగిసే నాటికి ప్రస్తుతం జలాశయాల్లో ఉన్న నీటితో తాగునీటి అవసరాలు తీర్చడం ప్రశ్నార్థకంగా మారింది.

ప్రస్తుతం జలాశయాల్లో నీటి మట్టం..

జూరాల ప్రాజెక్టు గరిష్ఠ నీటి మట్టం 9 టీఎంసీలు. ప్రస్తుతం తాగునీటి అవసరాల కోసం 0.241 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది.

రామన్‌పాడ్ జలాశయం గరిష్ఠ నీటి మట్టం 1,21,09 ఫీట్లు కాగా ప్రస్తుతం 1,11,02 ఫీట్లకు పడిపోయింది.

నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం కింద గుడ్డెందొడ్డి జలాశయం, ర్యాలంపాడు జలాశయాల్లో గరిష్ఠ నీటి మట్టం 3.28 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.20 టీఎంసీ నీరు మాత్రమే ఉంది.

గోపాల్‌దిన్నె జలాశయం గరిష్ఠ నీటి మట్టం 295.622 ఎంసీఎఫ్‌టీలు కాగా ప్రస్తుతం 162.956 మాత్రమే ఉంది.

కోయిల్‌సాగర్ జలాశయం గరిష్ఠ నీటి మట్టం 2.23 టీఎంసీలు కాగా ప్రస్తుతం ఒక టీఎంసీ నిలువ ఉంది.

ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లతో ఉదాసీనత

ఉమ్మడి జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు, జలాశయాలు వేర్వేరు శాసనసభ నియోజకవర్గాల పరిధిలో ఉన్నాయి. కొత్త జిల్లాల ఏర్పాటు అనంతరం జలాశయాల నిర్వాహణ వేర్వేరు జిల్లాల సాగునీటి పారుదలశాఖ అధికారుల అజమాయిషీ పరిధిలోకి చేరింది. వర్షాకాలం, యాసంగి పంట కాలానికి ముందు సాగునీటి విడుదలతో పాటు జలాశయాల నిర్వాహణకు సాగునీటి సలహా మండలి సమావేశాల ఏర్పాటు సైతం వివాదాస్పదమవుతోంది. సకాలంలో సమావేశాలు నిర్వహించడం సాగు, తాగునీటి అవసరాలపై సరైన నిర్ణయాలు తీసుకోవడంలో ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. ఆయా నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న శాసనసభ్యులు ఎవరికి వారు తమ నియోజకవర్గాల ఆయకట్టుకు సాగునీరందించాలనే ఒత్తిళ్లను నీటిపారుదలశాఖ అధికారులు ఎదుర్కొంటున్నారు. దీంతో పాటు యాసంగి పంట సాగుకు నీరు విడుదల చేయడంతో తాగునీటి అవసరాలు తీర్చలేని పరిస్థితి దాపురిస్తోంది. ప్రస్తుత యాసంగిలో జూరాల, రామన్‌పాడ్‌తో పాటు ఇతర సాగునీటి పథకాల కింద పంట సెలవు ప్రకటించినా జలాశయాలు తాగునీటి అవసరాలు తీర్చలేని పరిస్థితులు ఉన్నాయి.

కేటాయింపులు ఇలా..

మిషన్ భగీరథ పథకం అమల్లోకి వచ్చాక అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 30 అక్టోబరు 2017న తాగునీటి అవసరాల కోసం నీటి కేటాయింపుపై జీవో నెం.885 జారీ చేసింది. ఆ జీవో మేరకు ఉమ్మడి జిల్లాలోని ఆయా జలాశయాల్లో నీటి కేటాయింపులు ఇలా..

జలాశయం నీటి కేటాయింపు టీఎంసీల్లో

జూరాల 1.220

గోపాల్‌దిన్నె 0.050

రంగసముద్రం 0.100

కోయిల్‌సాగర్ 1.220

రామన్‌పాడ్ 1.000

శంకరసముద్రం 0.315


తాగునీటికి తొలి ప్రాధాన్యం: జిల్లాలోని సాగునీటి జలాశయాల ద్వారా ప్రస్తుత వేసవిలో తాగునీటి అవసరాలు తీర్చేందుకే ప్రాధాన్యమిస్తున్నాం. జలాశయాల్లో నీరు అడుగంటుతున్న పరిస్థితిని ఉన్నతాధికారులతో పాటు ప్రభుత్వ పెద్దలకు వివరించాం. రాష్ట్ర ప్రభుత్వం కర్ణాటకలోని జలాశయాల నుంచి నీటిని విడుదల చేసే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం ఉంది. సత్యశీలారెడ్డి, ఎస్ఈ, వనపర్తి జిల్లా

# సీఎం రేవంత్‌కు ఎంపీ లక్ష్మణ్ కౌంటర్



హైదరాబాద్, మార్చి 13: బీఆర్ఎస్‌తో బీజేపీకి ఒప్పందం ఉందన్న సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను బీజేపీ ఎంపీ లక్ష్మణ్ తీవ్రంగా ఖండించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రికి ఎంపీ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్‌కు మార్గం సుగమం అవుతుందని అన్నారు. ఐదేళ్ళ తర్వాత జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచేది బీజేపీనే అని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతలు .. వాళ్ళంతట వాళ్ళు ప్రభుత్వాన్ని పడగొట్టుకుంటే వాళ్ళదే బాధ్యత అని అన్నారు. బీఆర్ఎస్‌ను బీజేపీ ఉపేక్షించే పరిస్థితి ఉండదన్నారు. బీఆర్ఎస్ చచ్చిన పాము అని.. బీఆర్ఎస్‌ను బీజేపీ బతికించదని ఎంపీ లక్ష్మణ్ స్పష్టం చేశారు.

# రహస్య ప్రాంతంలో ప్రణీత్ రావును విచారిస్తున్న పోలీసులు



హైదరాబాద్ : మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు అలియాస్ ప్రణీత్‌కుమార్ పంజాగుట్ట పోలీసుల అదుపులో ఉన్నారు. విచారణలో స్టేట్ మెంట్ రికార్డ్ చేసి మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచనున్నారు. రహస్య ప్రాంతంలో ప్రణీత్ రావును పోలీసులు విచారిస్తున్నారు. అతని వద్ద నుంచి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసుల ఎఫ్ఎస్ఎల్‌కు పంపించారు. అందులో ఉన్న డేటా మొత్తాన్ని రిట్రైవ్ చేయనున్నారు. గతంలో ప్రణీత్‌రావు వాడిన సిమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. ప్రణీత్ వ్యవహారంలో సిటీ పోలీస్‌తో పాటు ఎఫ్ఎస్ఎల్ టీంతో ప్రత్యేక బృందం ఏర్పాటైంది. పోలీస్ బృందాలు రెండు రోజుల పాటు ఎస్ఐబీలో కీలక ఆధారాలు సేకరించాయి.


దాదాపు10 లక్షలకు పైగా కాల్ రికార్డింగ్స్‌ను స్టోర్ చేసినట్టు గుర్తించారు. డిసెంబర్ 4న రికార్డులను మొత్తాన్ని ప్రణీత్‌రావు తొలగించారు. తెలంగాణలో ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఫోన్లు ట్యాప్ చేశారు. ప్రణీత్ రావ్ లిస్టులో రాజకీయ నాయకులు, సీనియర్ పోలీస్ అధికారులు కూడా ఉన్నారు. కాగా స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో(ఎస్ఐబీ)లో విధుల దుర్వినియోగం, అనధికారిక ఫోన్ ట్యాపింగ్, కంప్యూటర్ హార్డ్‌డిస్క్‌ల ధ్వంసం కేసులో మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు అరెస్టయిన విషయం తెలిసిందే. కేసు దర్యాప్తు చేస్తున్న పంజాగుట్ట పోలీసులు మంగళవారం రాత్రి అతన్ని రాజన్న-సిరిసిల్ల జిల్లా కేంద్రంలో అదుపులోకి తీసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎస్ఐబీలో డీఎస్పీగా పనిచేసిన ప్రణీత్‌రావు అప్పట్లో విపక్ష నేతల ఫోన్లను ట్యాప్ చేశారనే అభియోగాలను ఎదుర్కొంటున్నారు. గత ఏడాది డిసెంబరు 4న (అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాతి రోజు) ప్రణీత్‌రావు కంప్యూటర్లు, హార్డ్‌డిస్క్‌లను కాల్చివేశారంటూ ఎస్ఐబీ అదనపు ఎస్పీ డి.రమేశ్ పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఆ మేరకు పంజాగుట్ట పోలీసులు ప్రణీత్‌రావుపై ఐపీసీ, పీడీపీపీ, ఐటీ చట్టాల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ప్రణీత్‌రావు సస్పెన్షన్‌కు ముందు రాజన్న-సిరిసిల్ల జిల్లా డీసీఆర్బీలో డీఎస్పీగా పనిచేశారు. సస్పెన్షన్ ఉత్తర్వుల్లోనే డీజీపీ రవిగుప్తా అతణ్ని సిరిసిల్ల జిల్లా హెడ్‌క్వార్టర్స్ దాటి వెళ్లకూడదని ఆదేశించారు. తొలుత ప్రణీత్‌రావు అజ్ఞాతంలోకి వెళ్లారనే వార్తలు వచ్చాయి. పంజాగుట్ట పోలీసుల బృందం సోమవారమే సిరిసిల్లకు చేరుకున్నా.. అతని జాడ దొరకలేదని సమాచారం. అయితే.. సిరిసిల్లలోని శ్రీనగర్‌కాలనీలో అతను అద్దెకు ఉంటున్న ఇంట్లో అరెస్టు చేసినట్లు పంజాగుట్ట పోలీసులు మంగళవారం రాత్రి ప్రకటించారు. ప్రణీత్‌రావును హైదరాబాద్‌కు తరలించారు. పంజాగుట్ట ఠాణాలో అతనిని ప్రాథమికంగా విచారిస్తున్నట్లు తెలిసింది. పశ్చిమ మండలం డీసీపీ విజయ్‌కుమార్ పర్యవేక్షణలో ఈ విచారణ జరుగుతున్నట్లు సమాచారం. విపక్ష నేతల ఫోన్ ట్యాపింగ్‌కు ఆదేశాలు ఇచ్చిందెవరు? ఎస్ఐబీలో ఎవరి ప్రోద్బలం ఉంది? ఎవరి మెప్పు కోసం ఫోన్లను ట్యాప్ చేశారు? ఆ సమాచారాన్ని ఎవరికి అందజేశారు? ధ్వంసం చేసిన కంప్యూటర్లు, హార్డ్‌డిస్క్‌లలో ఏముంది? అనే కోణాల్లో విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

# గోదావరి జలాలు విడుదల చేసి పంటలు కాపాడాలి

చేర్యాల, మార్చి 13 : తపాస్‌పల్లి, లద్నూరు రిజర్వాయర్లకు ప్రభుత్వం వెంటనే గోదావరి జలాలు పంపింగ్ చేసి చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలంలోని చెరువులు, కుంటలు నింపి రైతుల పంటలు కాపాడాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే పల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, ఆయన కుమారులు చేపడుతున్న పనులపై ఫైర్ అయ్యారు. రైతులను ఆదుకునే మనసు కాంగ్రెస్ సర్కారుకు లేదన్నారు.

గోదావరి జలాలలు అందుబాటులో ఉన్నప్పటికి ఎందుకు తపాస్‌పల్లి, లద్నూరు రిజర్వాయర్ నింపడం లేదని ప్రశ్నించారు. సంబంధిత అధికారులు వెంటనే రిజర్వాయర్లు నింపి చెరువులు, కుంటలకు నీల్లు విడుదల చేయాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు మంత్రి కేటీఆర్ ద్వారా జీవో నెం.824 ద్వారా చేర్యాల మున్సిపాలిటీకి రూ.10కోట్లు, జనగామ మున్సిపాలిటీకి రూ.25కోట్లు తాను మంజూరు చేయించానని చెప్పారు. అవే నిధులతో ఓటమి పాలైన నాయకులు కొబ్బరికాయలు కొట్టి ప్రారంభోత్సవాలు చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నేతలు, నాయకులు గ్రామాల్లో, పట్టణాల్లో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో పాటు ఇతరులను బెదిరిస్తే బయపడేది లేదని అన్నివర్గాలను బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను...
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.
సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194



# లోక్‌సభ అభ్యర్థుల ఖరారు: ఇటు గాంధీభవన్‌లో.. అటు ఢిల్లీలో కీలక సమావేశాలు!

హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో గెలుపు కోసం తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రణాళిక రూపొందిస్తోంది. మొత్తం స్థానాల్లో నాలిగింటిని ఇప్పటికే అభ్యర్థుల్ని ఖరారు చేసింది. ఈ క్రమంలో మిగతా అభ్యర్థుల ఖరారు కోసం నేడు ఇటు హైదరాబాద్‌లో, అటు హస్తినలో కీలక సమావేశాలు నిర్వహిస్తోంది. బుధవారం గాంధీభవన్‌లో తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మిగిలిన 13 పార్లమెంట్ స్థానాలపై అభిప్రాయ సేకరణ చేస్తున్నారామె. ఆయా నియోజకవర్గాల వారీగా.. డీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, ఇతరత్రా నేతలు ఈ భేటీలో పాల్గొంటున్నారు. టికెట్ ఎవరికిస్తే బాగుంటుందనే దానిపై ఒక్కొక్కరి నుంచి విడివిడిగా ఆమె అభిప్రాయం సేకరిస్తున్నారు.

ఏఐసీసీ సూచనల మేరకే అభిప్రాయాలను సేకరిస్తున్నట్టు హస్తం పార్టీ నేతలు చెబుతున్నారు. అదే సమయంలో ఢిల్లీలో ఏఐసీసీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశం జరిగింది. ఈ నేపథ్యంలో ఆ సమావేశం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి ఢిల్లీకి వెళున్నారు. కాంగ్రెస్ సీఈసీ భేటీ అనంతరం.. మరికొన్ని పార్లమెంట్ స్థానాల్లో అభ్యర్థుల విషయంలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# కేసీఆర్ ఏం మాట్లడుతుండో ఆయనకే తెలియాలి.. జీవన్‌రెడ్డి ఎద్దేవా



హైదరాబాద్, మార్చి 13: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఏం మాట్లడుతుండో ఆయనకే తెలియాలని ఎమెల్సీ జీవన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ఖరీఫ్ సాగు నీరు అందకపోవడానికి కేసీఆరే కారణమన్నారు. కరువుకు కేసీఆరే కారణమని విమర్శించారు. మిషన్ భగీరథ ఫెయిల్యూర్ ప్రాజెక్టని అన్నారు. కమిషన్ల కక్కుర్తితోనే మిషన్ భగీరథ ప్రాజెక్టు తీసుకొచ్చారని ఆరోపించారు. ఆ సలహా ఇచ్చిన అధికారిని ఉరి తీయాలని తాను సభలోనే చెప్పానన్నారు. పంటలు తడి ఆరకుండా చూడాలన్నారు. కాళేశ్వరం, యాదాద్రి పవర్ ప్రాజెక్టుపై పవర్ కొనుగోలుపై జ్యూడిషరీ ఎంక్వయిరీ వేయడంతో కేసీఆర్ పరేషన్లో పడ్డారన్నారు. మూడు పిల్లర్లు దెబ్బతింటే ఐపోయిందా అని కేసీఆర్ అంటుండు అని.. గుండె పోయిన తర్వాత మనిషి బతుకుతాడా ? అని ప్రశ్నించారు. “సభకు రాకుండా టీవీ ముందుకు వస్తా అంటుండు. నిన్ను ఎవరైనా అవుతున్నారా? నా 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏ ప్రభుత్వమైన ఏర్పడిన 100 రోజుల్లో హామీలను అమలు చేసిన సందర్భం లేదు. బీఆర్ఎస్ 10 ఏళ్లల్లో చెయ్యలేనివి రేవంత్ రెడ్డి మూడు నెలల్లో చేసి చూపారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీజేపీ కూడా కనుమరుగవుతుంది. భాష గురించి కేసీఆరే మాట్లాడాలి. బీఆర్ఎస్ నేతలకు ఇన్ని రోజులు కేసీఆర్ మాట్లాడితే వినసొంపుగా ఉంది.

ఇప్పుడు రేవంత్ రెడ్డి మాట్లాడితే సీసం పోసినట్లు ఉందా? మా పార్టీ సెంట్రల్ ఆఫీస్ ఢిల్లీ లో ఉంది. సమావేశాలకు వెల్లాల్సిన అవసరం మాకు ఉంటుంది. మహారాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు హైదరాబాద్ ఎందుకు వస్తున్నారు?” అని జీవన్ రెడ్డి నిలదీశారు.

# ప్రజలు ఛీ కొట్టినా కేసీఆర్‌కు బుద్ధి రాలేదు...



కరీంనగర్, మార్చి 13: ప్రజలు ఛీ కొట్టినా కేసీఆర్‌కు బుద్ధి రాలేదని బీజేపీ ఎంపీ బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. అబద్ధాల పునాదుల మీద బీఆర్ఎస్ నడుస్తోందన్నారు.

“నీ పార్టీలో తెలంగాణ పదమే లేదు.. ప్రజల గురించి మాట్లాడే హక్కు నీకు లేదు. ఆంధ్రాలో ఏడు మండలాలను కలిపింది కేసీఆరే.. ఆఫ్ట్రాల్ ఏడు మండలాలు అని కేసీఆర్ సైలెంట్‌గా ఉన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్ నువ్వు నిజాయితీ పరుడివా? మరి ధరణిని అడ్డు పెట్టుకుని భూములు ఎందుకు కాజేశారు? స్మార్ట్ సిటీపై మొదట వెంకయ్య నాయుడును కలిసింది నేనే. నాకు పేరు రాకుండా మీరు కుట్ర చేశారు. నేను లోకల్.. వినోద్ నాన్ లోకల్” అంటూ బండి సంజయ్ వ్యాఖ్యలు చేశారు.

# ఆ రోజే కేసీఆర్ నడుము విరగ్గొట్టి దేవుడు శిక్ష వేశాడు



నల్గొండ, మార్చి 13: ఆరు గ్యారెంటీలు అమలు చేస్తున్నామని... ఊళ్లకు పోతే నీళ్ల సమస్యలతో కళ్ళలో నీళ్లు వస్తున్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. డబ్బుల ఆశతో కేసీఆర్, అల్లుడు, కొడుకులు... హైదరాబాద్‌లో టానిక్ షాపులు, ఢిల్లీలో మందు షాపులు, కాళేశ్వరం పేరుతో దోపిడీ చేసి దక్షిణ తెలంగాణను నాశనం చేశారని విమర్శించారు. అందుకే రిజల్ట్ వచ్చిన రోజే కేసీఆర్ నడుము విరగ్గొట్టి దేవుడు శిక్ష వేశారన్నారు. డిండి, ఎస్ఎల్ బీసీ పూర్తి చేస్తే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. రోజుకు నలుగురు పార్టీ మారుతుంటే బీఆర్ఎస్ ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. కేసీఆర్ దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానన్న మొదటి హామీనే అమలు చేయలేదన్నారు. బీఆర్ఎస్ మొదటి ఐదేళ్లలో మహిళా మంత్రి లేని రాష్ట్రం కాబట్టే వారి ఉసురు తగిలి కరువు వచ్చిందని వ్యాఖ్యలు చేశారు.

అన్ని వర్గాలకు న్యాయం చేసింది కాంగ్రెస్ పార్టీనే అని అన్నారు. చచ్చిన పాము లాంటింది బీఆర్ఎస్ పార్టీ.... ఎంపీ ఎన్నికల్లో ఈసారి ఒక్క సీటూ రాదని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నా.. నన్నెవరు కిడ్నాప్ చేయలేదు : అరూరి రమేష్



హైదరాబాద్ : తాను పార్టీ మారడం లేదని, బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నాని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. బీఆర్ఎస్ వీడి బీజేపీలో చేరుతున్నారనే ప్రచారం నిజం కాదన్నారు. నిన్న కేంద్ర మంత్రి అమిషాను కలువలేదని స్పష్టం చేశారు. నన్ను ఎవరూ బలవంతంగా తీసుకెళ్ల లేదు. నా వ్యక్తిగత పనిమీద హైదరాబాద్ వెళ్తున్నట్లు ఆయన వివరణ ఇచ్చారు. కాగా, రమేష్ బీజేపీలో చేరాలని ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులు నానా హంగామా సృష్టించారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు వాహనంలో కూర్చున్న అరూరి రమేష్‌ను వాహనంలో నుంచి బీజేపీ కార్యకర్తలు బయటకు లాగారు. బీజేపీలో చేరాలని రమేష్‌ను ఆ పార్టీ కార్యకర్తలు దీనంగా వేడుకున్నారు. ఈ నేపథ్యంలో తాను మారడం లేదని ఆయన స్పష్టతనిచ్చారు.

# నగరంలో.. 3 రూట్లలో గ్రీన్‌మెట్రో బస్సులు



హైదరాబాద్ సిటీ: గ్రేటర్‌లో నాన్ ఏసీ గ్రీన్‌మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులు మూడు రూట్లలో పరుగులు పెట్టనున్నాయి.

నూతనంగా ప్రారంభించిన 22 బస్సులతో ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్య 87కు చేరింది. సికింద్రాబాద్-మణికొండ, సీబీఎస్-పటాన్‌చెరువు, కోఠి-పటాన్‌చెరువు రూట్లలో కొత్తబస్సులు నడిపేలా అధికారులు రూట్‌మ్యాప్ సిద్ధం చేస్తున్నారు. ఎలక్ట్రిక్ బస్సులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతీ బస్‌డిపోలో ఈవీ చార్జింగ్‌స్టేషన్లు అందుబాటులోకి తెచ్చేదిశగా ఆర్టీసీ ఏర్పాట్లు చేస్తోంది.

**గ్రీన్‌మెట్రో ప్రత్యేకతలు ఇవే..** - 12 మీటర్ల పొడవైన ఈ-బస్సు 100 శాతం ఎలక్ట్రిక్ మాత్రమే కాకుండా ఎలాంటి ఉద్గారాలను వెలువరించదు. - 35 మంది సీటింగ్ సామర్థ్యం -ముందు, వెనుక ఎయిర్ సస్పెన్షన్ - సింగిల్ చార్జ్‌తో 225 కిలోమీటర్లు ప్రయాణించే సౌలభ్యం - 3-4 గంటలు చార్జింగ్‌తో వంద శాతం పూర్తి - నెల రోజుల బ్యాక్‌పతో సీసీ కమెరాలు - రివర్స్ పార్కింగ్‌కు సహాయక కెమెరా - అగ్నిమాపక అలారం వ్యవస్థ - వాహన ట్రాకింగ్ వ్యవస్థ, - సీటు పక్కన సెల్ చార్జింగ్ సదుపాయం - పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టం

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660